@netifocusnews @focustv
www.netifocusnews.com
http://epaper.netifocusnews.com
TS-18-0006625

FOCUS TELUGU TV
అనునిత్యం - ప్రజాపక్షం

# నేటి ఫోకస్ న్యూస్

అను నిత్యం...ప్రజా పక్షం...

తెలుగు డిజిటల్ దినపత్రిక

ఎడిటర్: యం.తరుణ్ | తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రజల కోసం మా ఈ నేటి ఫోకస్ న్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రిక || హైదరాబాద్ || బుధవారం 05, జూన్ 2024 || పేజీలు: 04

# పోటాపోటీ

## తెలంగాణలో కాంగ్రెస్-బీజేపీ చెరో 8సీట్లు కైవసం..

- హైదరాబాద్ లోక్‌సభ నుంచి ఐదోసారి అసదుద్దీన్ ఎన్నిక
- ఒక్క సీటు కూడా సాధించలేని గులాబీ పార్టీ
- దక్షిణ తెలంగాణపై పట్టు నిలుపుకొన్న హస్తం
- ఉత్తర తెలంగాణ, హైదరాబాద్, శివార్లలో బీజేపీ హవా..
- ఐదుగురు సిట్టింగ్ ఎంపీల ఓటమి..
- తొలిసారిగా ఎన్నికైన 8మంది



నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-జూన్ 04:

రాష్ట్రంలోని 17లోక్‌సభ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ చెరో 8 స్థానాల్లో విజయం సాధించాయి. హైదరాబాద్ లోక్‌సభ స్థానాన్ని ఎంఐఎం నిలుపుకొంది. ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న బీఆర్ ఎస్ ఒక్క స్థానాన్ని కూడా సాధించ లేకపోయింది. ఈ ఎన్నికల్లో వివిధ పార్టీల తరపున మొత్తం 9 మంది సిట్టింగ్ ఎంపీలు పోటీచేయగా.. వారిలో ఐదుగురు ఓటమి పాల య్యారు. ఓడినవారిలో నామా నాగేశ్వర్‌రావు, మాలోతు కవిత, రంజిత్‌రెడ్డి, మన్నె శ్రీనివాస్‌రెడ్డి, బీబీ పాటిల్ ఉన్నారు. అసదుద్దీన్, కిషన్‌రెడ్డి, బండి సంజయ్, అరవింద్ మాత్రమే తమ సీట్లను నిలుపుకొన్నారు. ఇక ఈసారి 8 మంది తొలిసారి ఎంపీగా గెలిచి రాష్ట్రం నుంచి లోక్‌సభలో అడుగుపెట్టబోతున్నారు. కాంగ్రెస్ దక్షిణ తెలంగాణలో పట్టు నిలుపుకోగా.. ఉత్తర తెలంగాణలో బీజేపీ సత్తా చాటింది. ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో ఉన్న మొత్తం 5 లోక్‌సభ సీట్లనూ కాంగ్రెస్ గెలుచుకుంది. ఉమ్మడి హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లోని నాలుగు లోక్‌సభ స్థానాల్లో బీజేపీ మూడింటిని గెలుచుకుని ఆ ప్రాంతాల్లో ఆధిపత్యం చాటింది. హైదరాబాద్ లోక్‌సభ స్థానం నుంచి ఎంఐఎం అధినేత, సిట్టింగ్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ వరుసగా ఐదోసారి విజయం సాధించడంతో పాత నగరంపై ఆ పార్టీ పట్టు నిలుపుకొంది. ఉమ్మడి మహబూబ్ నగర్, కరీంనగర్, మెదక్ జిల్లాల్లో రెండేసి చొప్పున మొత్తం ఆరు లోక్‌సభ సీట్లు ఉండగా.. కాంగ్రెస్, బీజేపీ చెరో మిగతా 2లో..

# పేదల గొంతుకై నిలుస్తాం

## ఫలితాలు ఆశ్చర్యం కలిగించాయి

### ప్రతిపక్షం.. పోరాటం.. కొత్తేమీ కాదు..

- ఎవరో మోసం చేశారు, అన్యాయం చేశారని అనొచ్చు
- అయితే ఆధారాలు లేవు.. ఏం జరిగిందో దేవుడికి తెలుసు
- ప్రజల తీర్పును స్వీకరిస్తాం.. వారి కోసం పోరాడతాం..
- ప్రభుత్వంలోకి వచ్చిన వారికి అభినందనలు
- నాకు తోడుగా నిలిచిన నేతలు, కార్యకర్తలు, వలంటీర్లు, నా అన్నదమ్ములు, అక్కచెల్లెమ్మలకు కృతజ్ఞతలు
- విలేకరుల సమావేశంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

ఏం జరిగిందో తెలియదు కానీ, ఏం చేసినా, ఎంత చేసినా ఇంకా 40 శాతం ఓటు బ్యాంకు మాత్రం తగ్గించలేకపోయారు. కచ్చితంగా గుండె ధైర్యంతో నిలబడి మళ్లీ ఇక్కడి నుంచి లేస్తాం. ప్రతిపక్షంలో ఉండటం కొత్తకాదు. పోరాటాలు చేయడం అంతకన్నా కొత్తకాదు. ఈ ఐదు సంవత్సరాలు తప్ప నా రాజకీయ జీవితమంతా ప్రతిపక్షంలోనే గడిపాను. రాజకీయ జీవితంలో ఎవ్వరూ చూడని కష్టాలు అనుభవించాను. ఇప్పుడు అంతకన్నా కష్టాలు పెట్టినా సిద్ధంగా ఉన్నాం. ఎదుర్కొంటాం. ప్రభుత్వంలోకి వచ్చిన వాళ్లకు ఆల్ ది వెరీ బెస్ట్.

– ముఖ్యమంత్రి వైఎస్ జగన్



నేటి ఫోకస్ న్యూస్, అమరావతి-జూన్ 04:

ఎవరో మోసం చేశారు, ఎవరో అన్యాయం చేశారు.. అని అనొచ్చు. కానీ ఆధారాలు లేవు. ఏం జరిగిందో దేవుడికి తెలుసు. నేనైతే చేయగలిగిందేమీ లేదు. ప్రజల తీర్పు తీసుకుంటాను. మంచి చేయడానికి మాత్రం కచ్చితంగా ప్రజలకు తోడుగా ఉంటాం. వాయిస్ ఆఫ్ ది వాయిస్‌లెస్ కింద ఈ పార్టీ తాను చేయాల్సిన పని తప్పకుండా చేస్తుంది. పేదవాడికి అండగా ఉండే కార్యక్రమంలో ఎప్పుడూ పేదవాడికి తోడుగా ఉంటూ గళం విప్పుతుంది. పెద్దపెద్ద వాళ్ల కూటమి ఇది. ఢిల్లీలో సైతం శాసించే పరిస్థితులు ఉన్న కూటమి మిగతా 2లో..





## లోక్‌సభ ఫలితాలు నిరాశ కలిగించాయి

- అన్ని రకాల ఎత్తుపల్లాలను చూశాం
- ఫలితాలపై కేటీఆర్ స్పందన

వివరాలు 02లో..

## రాజకీయాల్లో పడిలేచిన కెరటం

- ఏపీలో పవన్ కళ్యాణ్ భారీ హిట్టు



వివరాలు 02లో..

# ఉమ్మడి వరంగల్‌లో వార్ వన్‌సైడ్

## రికార్డు క్రియేట్ చేసిన మెజార్టీలు

### గెలుపు గుర్రాలివే..




వరంగల్, (నేటి ఫోకస్‌న్యూస్ ప్రత్యేక ప్రతినిధి)-జూన్ 04:

ఉమ్మడి వరంగల్ జిల్లాలో పార్లమెంటు ఎన్నికలు హోరా హోరీగా జరిగినప్పటికీ ఫలితాలు మాత్రం వన్ సైడ్ అయ్యాయి. కౌంటింగ్ ప్రారంభం నుండి చివరి వరకు కాంగ్రెస్ అభ్యర్థులు రౌండ్ రౌండ్ కు మెజార్టీని కొనసాగించారు. వరంగల్, మహబూబాబాద్ పార్లమెంట్ స్థానాలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది. రెండు స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధిస్తారని అనుకున్న ఎవ్వరు ఊహించని మిగతా 2లో..











# మరోమారు ప్రజల ఓటు సంకీర్ణానికే

- బిజెపి, కాంగ్రెస్‌లకు దక్కని సంపూర్ణ మెజార్టీ
- 246 సీట్ల వద్దే ఆగిన బిజెపి ప్రయాణం
- మోడీ నాయకత్వంపై అప్పుడే అనుమానాలు
- మెజార్టీ ఎన్‌డిఏ పక్షాల చేతిలో ప్రభుత్వ భవితవ్యం
- ఎన్‌డిఎలో కీలకం కానున్న చంద్రబాబు, నితీశ్
- ఆచితూచి అడుగులు వేయనున్న కాంగ్రెస్ కూటమి
- నేడు ఎన్‌డి కూటమి నేతల సమావేశం

నేటి ఫోకస్ న్యూస్, న్యూఢిల్లీ-జూన్4:

సార్వత్రిక ఎన్నికల ఫలితాలు క్రమంగా వస్తున్నాయి. అనూహ్యంగా ఎగ్జిట్ పోల్స్‌ను తలదన్నేలా కాంగ్రెస్ కూటమి దూసుకు వచ్చింది. 200 సీట్లను అధిగమించింది. ఆ పార్టీ ఇప్పుడు బలమైన విపక్షంగా అవతరించనుంది. అయితే లోక్‌సభ ఎన్నికల పలితాల సరళిని బట్టి అధికారం ఏర్పాటుకు ప్రజలు ఏ ఒక్క పార్టీకి స్పష్టమైన మెజార్టీని మిగతా 2లో..



నేటి ఫోకస్ న్యూస్

బుధవారం 05, జూన్ 2024

# లోక్‌సభ ఫలితాలు నిరాశ కలిగించాయి

- అన్ని రకాల ఎత్తుపల్లాలను చూశాం
- ఫలితాలపై కేటీఆర్ స్పందన

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-జూన్4:**

లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. పార్టీ స్థాపించి 24 సంవత్సరాల సుదీర్ఘ ప్రస్థానంలో అన్ని రకాల ఎత్తుపల్లాలను చూశామన్నారు. అద్భుతమైన విజయాల తోపాటు అనేక ఎదురుదెబ్బలు, ఎదుర్కొన్నామన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడమే మాకు అతి పెద్ద గౌరవమన్నారు కేటీఆర్. ఒక ప్రాంతీయ పార్టీగా వరుసగా రెండుసార్లు అద్భుతమైన మెజార్టీలతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకున్నామని కేటీఆర్ గుర్తు చేశారు. 2014లో 63 సీట్లతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తే, 2018లో 88 అసెంబ్లీ స్థానాలతో రెండవసారి ప్రభుత్వాన్ని విజయవంతంగా ఏర్పాటు చేశామన్నారు. ప్రస్తుతం శాసనసభలో 39 సీట్లతో ప్రధాన ప్రతిపక్షంగా కొనసాగుతున్నాం. ప్రజా పక్షాన పోరాడేందుకు అవకాశమిచ్చారన్నారు. ప్రభుత్వ తప్పులను ఎత్తిచూపుతామన్నారు కేటీఆర్. లోక్‌సభ ఎన్నికల ఫలితాలు కచ్చితంగా నిరాశను కలిగించాయన్నారు. అయినా ఎప్పటిలాగే మరింత కష్టపడి ఉన్నత శిఖరాలకు చేరుకుంటామన్న విశ్వాసం ఉందని కేటీఆర్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఫీనిక్స్ పక్షి లెక్క తిరిగి పుంజుకుంటామన్నారు.

# రాజకీయాల్లో పడిలేచిన కెరటం

- ఎపిలో పవన్ కళ్యాణ్ భారీ హిట్టు

**నేటి ఫోకస్ న్యూస్, అమరావతి-జూన్4:**

మెగాస్టార్ చిరంజీవి తమ్ముడిగా అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి సినిమాతో చలన చిత్ర పరిశ్రమలో అడుగు పెట్టిన పవన్ కళ్యాణ్.. ఇంతింతై వటుడింతై అన్న చందంగా ఎదిగాడు. హిట్ ఫ్లాప్ లతో సంబంధం లేకుండా పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ అభిమానులను అలరిస్తూనే ఉన్నాడు. అందరి హీరోలకు అభిమానులుంటారు. అన్న మెగా స్టార్ చిరంజీవి స్థాపించిన ప్రజారాజ్యం పార్టీలో యువనేతగా రాజకీయంలో అడుగు పెట్టాడు. రాజకీయంగా అన్నతో విబేధించి ఆ పార్టీ నుంచి బయటకు వచ్చిన పవన్ కళ్యాణ్ అనూహ్యంగా జనసేన పార్టీని స్థాపించాడు. అయితే 2014 లో నవ్యాంధ్రప్రదేశ్ లో జరిగిన ఎన్నికల్లో పోటీ చేయకుండా ఎన్డీయే కూటమికి బేషరత్తుగా తన మద్దతు ప్రకటించాడు. ప్రభుత్వం పని తీరు నచ్చక పోతే నేను ప్రశ్నిస్తా అని అన్న జనసేనాని.. అప్పటి నుంచి అధికారంలో ఉన్న పార్టీ ఏదైనా తనకు అన్యాయం అన్న విషయంపై, ప్రభుత్వంలో జరిగే అవకతవకలపై తన గళం వినిపిస్తూనే ఉన్నాడు. 2019లో జరిగిన ఎన్నికల్లో ఒంటరిగా పోటీకి వెళ్ళిన పవన్ కళ్యాణ్ ఘోర పరాజయాన్ని పొందాడు. తాను పోటీ చేసిన విశాఖ, భీమవరం నుంచి మాత్రమే కాదు.. ఒక్క రాజోలు నియోజక వర్గం ఎమ్మెల్యే రాపాక మినహా మిగిలిన జనసేన అభ్యర్థులు కూడా ఓటమి పాలయ్యారు. అప్పుడు సర్వత్రా విమర్శలను ఎదుర్కొన్నాడు. వైసిపీ ప్రభుత్వం, జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం తీరుపై సునిసిత విమర్శలు చేస్తూ.. ప్రజలు కష్టాల్లో తానున్నాను అంటూ భరోసాగా నిలిచాడు. అన్నదాతలకు మాత్రమే కాదు చేనేత కార్మికులకు.. ఇలా బాధితులకు అండగా నిలిచాడు. తన సొంత డబ్బులకు బాధిత కుటుంబాలకు ఇచ్చి అండగా నిలిచాడు. అంతేకాదు.. ఏపీలో ఎన్నికల సమయం దగ్గర పడుతుండగా వైసిపీకి చెక్ పె÷-టటె విధంగా రాజకీయ చతురతను చాటుకున్నాడు. చంద్రబాబు నాయుడు జైల్లో ఉన్న సమయంలో పరామర్శకు వెళ్ళిన పవన్ హటాత్తుగా మీడియా ముందుకు వచ్చి ఎన్నికల్లో టిడిపీ, జనసేన కలిసి పోటీ చేస్తుంది అని ప్రకటించాడు. అంతేకాదు.. ఏపీ ప్రజల ప్రయోజనం కోసం తనని తానూ తగ్గించుకుని మరీ తక్కువ సీట్లతోనే పోటీకి వెళ్ళడమే కాదు.. బీజేపీని కూడా కూటమితో కలిసి నడిచేలా చేయడంలో పవన్ పాత్ర గురించి ఎంత చెప్పినా తక్కువే.. పిఠాపురం నుంచి బరిలోకి దిగిన పవన్ కళ్యాణ్ ను ఓడించడం కోసం అధికార వైసిపీ ప్రభుత్వం రాజకీయ ఉద్దండులను రంగంలోకి దింపింది. స్వయంగా సిఎం జగన్ .. వైసిపీ అభ్యర్థి వంగా గీతను గెలిపిస్తే డిప్యూటీ సిఎం పదవిని ఇస్తానని ప్రకటించారు. అయినప్పటికీ పవన్ కళ్యాణ్ గెలుపు నల్లేరు మీద నడకలా సాగింది. పవన్ మీద అభిమానంతో మెగా హీరోలు మాత్రమే కాదు అనేక మంది మేము సైతం అంటూ మద్దతు తెలిపారు.

# పోటాపోటీ..

(మొదటి పేజీ తరువాయి..)

మూడు సీట్లను దక్కించుకున్నాయి. అదీ ప్రతి జిల్లాలో చెరో సీటు సాధించడం గమనార్హం. ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లోని రెండు సీట్లనూ బీజేపీ కైవసం చేసుకుంది.

**పట్టుపెంచుకున్న ఇరు పార్టీలు..**

2019 లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో 4 స్థానాలను గెలిచిన బీజేపీ.. ఈసారి తన బలాన్ని 8 సీట్లకు పెంచుకుంది. కాంగ్రెస్ కూడా 3 సీట్ల నుంర్టీచి 8 సీట్లకు బలాన్ని పెంచుకుంది. గత ఎన్నికల్లో 9 సీట్లు గెలిచిన బీఆర్ఎస్ ఈసారి ఖాతా తెరవలేకపోయింది. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో 64 సీట్లు గెలిచి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి.. ఆ ఎన్నికల్లో కేవలం 8 అసెంబ్లీ స్థానాలే గెలిచిన బీజేపీ లోక్‌సభ ఎన్నికల్లో గట్టిపోటీ ఇచ్చి సమ ఉజ్జీగా నిలిచింది. అసెంబ్లీ ఎన్నికల్లో 39 స్థానాలను గెలుచుకున్న బీఆర్ఎస్ ఒక్క లోక్‌సభ సీటు గెలవలేదు.

**గత, ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో ప్రధాన పార్టీలకు వచ్చిన సీట్లివీ..**

| పార్టీ | 2014 | 2019 | 2024 |
|---|---|---|---|
| కాంగ్రెస్ | 2 | 3 | 8 |
| బీజేపీ | 1 | 4 | 8 |
| ఎంఐఎం | 1 | 1 | 1 |
| బీఆర్ఎస్ | 11 | 9 | 0 |

# పేదల గొంతుకై నిలుస్తాం..

(మొదటి పేజీ తరువాయి..)

ఇది. ఈ కూటమిలో ఉన్న బీజేపీ, చంద్రబాబుకు, పవన్ కళ్యాణ్‌కు, అందరికీ కూడా వాళ్ల గొప్ప విజయానికి అభినందనలు. ఓడిపోయినా, నా ప్రతి కష్టంలో తోడుగా, అండగా నిలబడిన ప్రతి నాయకుడికీ, ప్రతి కార్యకర్తకూ, ప్రతి వలంటీర్‌కు, ప్రతి ఇంట్లో నుంచి వచ్చి స్టార్ క్యాంపెయినర్‌గా నాకు తోడుగా నిలబడిన నా అక్కచెల్లెమ్మలకు, అన్నదమ్ములకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నా.

దేశంలో ఏ రాష్ట్రంలో జరగనన్ని సంక్షేమ పథకాలు, ఎక్కడా ఏ పేదవాడికీ దక్కని ప్రయోజనాలు.. అవినీతికి తావు లేకుండా, నేరుగా వారి గుమ్మం వద్దకే తీసుకువెళ్లే వ్యవస్థను ఏర్పాటు చేసినప్పటికీ ఎందుకిలా జరిగిందో తెలియడం లేదని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. సార్వత్రిక ఎన్నికల ఫలితాల అనంతరం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'ఫలితాలన్నీ దాదాపుగా కొలిక్కి వస్తున్నాయి.

జరిగిన పరిస్థితులు చూస్తే నిజంగా ఆశ్చర్యంగా ఉంది. ఇలా జరుగుతుందని, ఫలితాలు ఇలా వస్తాయని ఊహించలేదు. పిల్లలు బాగుండాలని, వాళ్ల చదువులు బాగుండాలని తాపత్రయపడుతూ.. అమ్మ ఒడి అందుకున్న 53 లక్షల మంది తల్లులకు మంచి చేశాం. వారికి మంచి చేయాలనే తపనతో అడుగులు వేశాం. 31 లక్షల ఇంటి పట్టాలు అక్కచెల్లెమ్మల పేరుతో ఇచ్చాం. వాటిలో 22 లక్షల ఇళ్లు కట్టిస్తున్నాం. మరి ఆ అక్క చెల్లెమ్మల ఓట్లు ఏమయ్యాయో తెలియదు' అన్నారు. '66 లక్షల మంది అవ్వాతాతలకు, వితంతువులకు, వికలాంగులకు గతంలో ఎన్నడూ జరగని విధంగా మంచి చేశాం.

వారి కష్టాల్లో తోడుగా ఉంటూ, వారి కష్టాన్ని అర్థం చేసుకుంటూ, వారి ఇంటికే సంక్షేమాన్ని పంపించే వ్యవస్థను సైతం తీసుకువచ్చాం. గతంలో మన ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఇస్తున్న చాలీచాలని పెన్షన్ నుంచి.. ఎంతో మంచి చేస్తూ అడుగులు వేసినా కూడా ఆ అవ్వాతాతలు చూపిన ఆప్యాయత ఏమైందో కూడా తెలియడం లేదు' అని ఆవేదన వ్యక్తం చేశారు.

'దాదాపు కోటీ 5 లక్షల మంది పొదుపు సంఘాల అక్కచెల్లెమ్మలకు మంచి చేస్తూ, వారి కష్టాలనే మా కష్టాలుగా భావిస్తూ, ఇచ్చిన ఏ మాటా తప్పకుండా అన్ని రకాలుగా వాళ్లకు అండగా ఉంటూ.. ఆసరా, చేయూతతో తోడున్నాం. సున్నా వడ్డీతో సైతం అండగా నిలిచాం. మరి ఆ కోటీ ఐదు లక్షల అక్కచెల్లెమ్మల ప్రేమాభిమానాలు ఏమయ్యాయో తెలియదు. 26 లక్షల మంది చేయూతను అందుకుంటున్న అక్కచెల్లెమ్మల ఆప్యాయత ఏమైందో తెలియదు' అని అన్నారు. సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..

**పిల్లల చదువుల కోసం పరితపించాం..**

'పిల్లల చదువుల కోసం ఏ తల్లీ, తండ్రీ ఇబ్బంది పడకూడదని మొట్టమొదటి సారిగా పూర్తి ఫీజు ఇస్తూ అండగా నిలవడం ద్వారా చదువుల్లో ఎప్పుడూ చూడని మార్పులు తీసుకొచ్చాం. ఏటా దాదాపూ 12 లక్షల మందికి మంచి చేశాం. ఆ పిల్లలు, తల్లుల అభిమానం ఏమయ్యిందో తెలియదు. 54 లక్షల మంది రైతలన్నలకు గతంలో ఎప్పుడూ చూడని విధంగా, జరగని విధంగా పెట్టుబడికి సహాయం అందించే కార్యక్రమం మన ప్రభుత్వం వచ్చిన తర్వాతే జరిగింది.

అంతగా రైతన్నకు తోడుగా ఉంటూ, రైతన్నలకు రైతు భరోసా ఇవ్వడం గానీ, సీజన్ ముగిసేలోగా ఇన్‌పుట్ సబ్సిడీ, ఉచిత ఇన్సూరెన్స్, పగటిపూటే 9 గంటల ఉచిత విద్యుత్ ఇచ్చే కార్యక్రమం చేశాం. మరి ఆ అరకోటి మంది రైతుల ప్రేమ ఏమైందో తెలియదు. ఆటోలు, టాక్సీలు నడుపుకుంటున్న వాళ్లు ఇబ్బంది పడకూడదని వారికి అండగా నిలుస్తూ వాహనమిత్ర, నేతన్నలకు అండగా ఉంటూ నేతన్న నేస్తం, మత్స్యకారులకు తోడుగా ఉంటూ మత్స్యకార భరోసా ఇచ్చాం.

పుట్‌పాత్‌ల మీద చిన్న చిన్న ఇడ్లీ దుకాణాలు, వ్యాపారాలు చేసుకుంటున్న నా అక్కచెల్లెమ్మలకు, నా అన్నదమ్ములకు మంచి జరగాలని ఆరాపడుతూ వాళ్లకు తోడుగా నిలిచాం. నా రజకులకు, నాయీ బ్రాహ్మణులకు, టైలర్లకు అండగా ఉంటూ చేదోడు ఇచ్చాం. ఇన్ని కోట్ల మందికి మంచి చేసి, ఎప్పుడూ జరగని విధంగా మేనిఫెస్టో అంటే చెత్త బుట్టలో పడేసే డాక్యుమెంట్ కాదు, మేనిఫెస్టో అంటే ఒక బైబిల్, ఖురాన్, భగవద్గీత అని మొట్టమెదటి రోజు నుంచీ భావిస్తూ.. ఏకంగా 99 శాతం వాగ్దానాలు అమలు చేశాం. చిత్తశుద్ధితో మేనిఫెస్టోను అక్కచెల్లెమ్మల ఇళ్లకు తీసుకెళ్లి చూపించి మీరే టిక్ పెట్టండి అనే నిబద్ధత గల ప్రభుత్వంగా పని చేశాం.

**ఇంటి వద్దకే సేవలు..**

ఎప్పుడూ జరగని విధంగా, పేదరికం పోవాలంటే.. పిల్లలకు క్వాలిటీ ఎడ్యుకేషన్ అవసరం అని ఇంగ్లిష్ మీడియంను వ్యతిరేకిస్తున్న పెత్తందార్లతో సైతం యుద్ధం చేసి పిల్లలకు ఇంగ్లిష్ మీడియం తీసుకురావడమే కాకుండా, ఆ పేద పిల్లలకు అండగా నిలబడాలని, తోడుగా ఉండాలని, వారి చరిత్రను కూడా మార్చాలని టోఫెల్, ఐబీ లాంటి కలలు కన్నాం. ఎప్పుడూ చూడని విధంగా గ్రామ స్థాయిలోనే సచివాలయం, వలంటీర్ వ్యవస్థను తీసుకువచ్చి.. వివక్ష, కరప్షన్ లేకుండా ప్రతి ఇంటికీ సేవలందించాం. దాదాపు రూ.2.70 లక్షల కోట్లు ఇంటి వద్దకే అందించగలిగాం.

ఎప్పుడూ చూడని మార్పులను తీసుకు రావడమే కాకుండా విద్య, వ్యవసాయం, వైద్య రంగంలో ఏ పేదవాడు ఎప్పుడూ ఇబ్బంది పడకూడదని, ఊహించని మార్పులు తీసుకొస్తూ పేదవాడికి అండగా నిలబడగలిగాం. మహిళా సాధికారత అంటే ఇదీ అని, సామాజిక న్యాయం అంటే ఇదీ అని ప్రపంచానికి చూపించగలిగాం. ఇన్ని గొప్ప మార్పులు చేసిన తర్వాత, ఇన్ని కోట్ల మందికి మంచి చేసిన తర్వాత ఆ అభిమానం ఏమయ్యిందో, ఆ ఆప్యాయత ఏమైందో తెలియదు' అంటూ ఎన్నికల ఫలితాలపై సీఎం జగన్ తన స్పందనను ముగించారు. అనంతరం సీఎం పదవికి రాజీనామా చేశారు.

# ఉమ్మడి వరంగల్లో వార్ వాన్‌సైడ్

(మొదటి పేజీ తరువాయి..)

స్థాయిలో మెజార్టీ రావడం రాజకీయ వర్గాలను ఆశ్చర్యానికి గురిచేసింది.

**బలరాం నాయక్ గెలుపు..**

20 రోజుల ఉత్కంఠకు తెరపడింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో కాంగ్రెస్ హవా ముందు బిజేపి వాడిపోగా.. కారు కదలలేక పోయింది. వరంగల్ పార్లమెంట్ నుండి కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య, మహబూబాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి బలరాం నాయక్ అత్యధిక మెజారిటీతో విజయం సాధించారు. ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్ తో ప్రారంభమైన మెజార్టీ ప్రతి రౌండ్ కు మెజార్టీ పెరుగుతూ చివరి రౌండ్ వరకు కొనసాగింది. వరంగల్ పార్లమెంటు లో బిజేపి రెండవ స్థానానికి నిలవగా, బీ అర్ ఎస్ మూడవ స్థానానికి పరిమితమైంది. మహబూబాబాద్ లో బీ అర్ ఎస్ రెండవ స్థానంలో ఉండగా బిజేపి మూడవ స్థానానికి వెళ్ళింది. గెలుపు పై ధీమాతో ఉన్న కడియం కావ్య కౌంటింగ్ సెంటర్ కు ఆలస్యంగా వచ్చింది.

**ఆశ్చర్యానికి గురిచేసిన భారీ మెజార్టీలు..**

మహబూబాబాద్ పార్లమెంటు నియోజకవర్గం లో ప్రధానంగా కాంగ్రెస్, బీఅర్ఎస్, బీజేపీ అభ్యర్థులు పోటీ పడ్డారు. ఇక్కడ కాంగ్రెస్, బీఅర్ఎస్ మధ్య ద్విముఖ పోరు





ఉంటుందని అనుకున్న కాంగ్రెస్ విజయం ఖాయమనుకున్నారు. కానీ ఈ రోజు ఫలితాల్లో పెద్ద సంఖ్యలో మెజార్టీ వస్తుందని ఎవరు ఊహించలేదు. ఎవరు గెలిచినా లక్ష లోపు మెజార్టీతో గెలుస్తారు అనుకున్నారు. కానీ అంచనాలకు మించి 3 లక్షల 49 వేల 165 మెజార్టీ తో సమీప బీ అర్ ఎస్ అభ్యర్థి మాలోతు కవిత పై కాంగ్రెస్ అభ్యర్థి బలరాం నాయక్ గెలవడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసిందని చెప్పవచ్చు.

**అదే కారణమా?**

మహబూబాబాద్ పార్లమెంట్లో పరిధిలో ఏడుగురు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే ఉండడంతో పాటు కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో బలంగా ఉండడం ఒక కారణమైతే. మరో కారణం బీ అర్ ఎస్ పార్టీ పై ఉన్న వ్యతిరేకతకు తోడు బిజేపి అభ్యర్థి బలమైన అభ్యర్తికకపోవడంతో పాటు బిజేపి పార్టీ సైతం బలంగా లేదు. దీంతో నేడు వెలువడిన ఫలితాలతో ప్రజలు ఏక పక్షంగా కాంగ్రెస్ పార్టీ వైపు మొగ్గు చూపడంతో కాంగ్రెస్ అభ్యర్థి బలరాం నాయక్ 3 లక్షల మెజార్టీ సాధించారు.

**వరంగల్‌లోనూ ఇంతే..**

ఇక వరంగల్ పార్లమెంట్ పరిధిలో కూడా ఊహకందని మెజార్టీని సాధించింది కడియం కావ్య. వరంగల్ పార్లమెంట్ పరిధిలో కాంగ్రెస్, బీఅర్ఎస్, బీజేపీ అభ్యర్థులు ఢీ అంటే ఢీ అనే విధంగా పోటీపడ్డారు. ఇక్కడ త్రిముఖ పోటి నెలకొన్న. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థుల్లో ఎవరూ గెలిచిన 50 వేల లోపు మెజార్టీ వస్తుందని అంచన వేశారు. అంతేకాదు కాంగ్రెస్ పార్టీ, ఆ అభ్యర్థి సైతం తక్కువ మెజార్టీతో విజయం సాధిస్తామని అనుకున్నారు. కొన్ని ఎగ్జిట్ పోల్ సంస్థలు వరంగల్ పార్లమెంటులో బీజేపీ గెలుస్తుందని చెప్పారు. కానీ అంచనాలు తారు మారై కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య ఊహించని విధంగా 2 లక్షల 19 వేల 691 మెజార్టీతో సమీప బీజేపీ అభ్యర్థి ఆరూరి రమేష్ పై విజయం సాధించింది. కడియం కావ్యకు బీజేపీ పార్టీ అభ్యర్థి పై ఉన్న వ్యతిరేకత, బీఅర్ఎస్ అధికారానికి దూరం కావడం కలిసివచ్చిన అంశాలుగా చెప్పవచ్చు. అయితే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి అండగా నిలిచిన వరంగల్ తీర్పు, పరకాల, వరంగల్ పశ్చిమ నియోజకవర్గాల్లో కూడా ఎంపీ వచ్చేసరికి ఓట్లు కాంగ్రెస్ కు మళ్ళాయి. ఏది ఏమైనా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని రెండు స్థానాల్లో రికార్డ్ స్థాయి మెజార్టీ రావడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసిందని చెప్పవచ్చు.

**2019, 2024 మెజార్టీలు ఇవీ..**

వరంగల్ పార్లమెంట్ పరిధిలో 2019 పార్లమెంటు ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థి పసునూరి దయాకర్ 3 లక్షల 50 వేల 298 మెజార్టీ సాధించి రికార్డు సృష్టించగా 2024 పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య 2 లక్షల 19 వేల 691 మెజార్టీ సాధించింది.

**మహబూబాబాద్ పార్లమెంట్..**

2019 ఎన్నికల్లో మహబూబాబాద్ పార్లమెంటు స్థానం నుండి టీఆర్ఎస్ అభ్యర్థి మాలోతు కవిత లక్ష 46 వేల 600 మెజారిటీతో విజయం సాధించగా 2024లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి కోరిక బలరాం నాయక్ 3 లక్షల 49 వేల 165 మెజార్టీ సాధించి కవిత రికార్డులు బ్రేక్ చేశారు.

# మరోమారు ప్రజల ఓటు సంకీర్ణానికే..

(మొదటి పేజీ తరువాయి..)

అందించలేదు. దీంతో మరోమారు సంకీర్ణం దిశగా భారత్ అడుగులు పడనున్నాయి. ఈ క్రమంలో బుధవారం ఎన్‌డిఎ పక్షాల సమావేశానికి బిజెపి అధ్యక్షుడు జెపి నడ్డా ఏర్పాటు చేశారు. చంద్రబాబు తదితరులను ఆహ్వానించారు. ఎన్నికల్లో బిజెపి నేతలు ప్రధాని మోడీ వారణాసి నుంచి, అమిత్ షా గాంధీనగర్ నుంచి మరోమారు విజయం సాధించారు. రాహుల్ గాంధీ వయనాడ్‌తో పాటు, రాయబరేలీలో కూడా ఘన విజయం సాధించారు. కేంద్రమంత్రులు పలువురు విజయం సాధించారు. తెలంగాణలో కిషన్ రెడ్డి సహా మొత్తం బిజెపి 8 సీట్లను కైవసం చేసుకుంది. బిఆర్ఎస్ ఎక్కడా ఒక్కటంటే ఒక్క సీటును కూడా గెలవలేదు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో బిజెపికి సీట్లు పెరిగినా..మ్యాజిక్ ఫిగర్‌కు చేరుకోలేకపోయింది. గతంలో బిజెపికి సంపూర్ణ మెజార్టీ ఇచ్చిన ప్రజలు ఈ దఫా మ్యాజిక్ ఫిగర్ 272కు దూరంగా ఉంచారు. ఎన్‌డిఎ పక్షాలతో కలసి ప్రభుత్వం ఏర్పాటు చేసేలా తీర్పును కట్టబెట్టారు. ఎన్‌డిఎ పక్షాలు ఇప్పుడు కీలక భూమికను పోషించనున్నాయి. ఇందులో ఎపికి చెందిన చంద్రబాబు, బీహార్‌కు చెందిన నితీశ్ కుమార్ కిలకంగా మారారు. వీరు బేషరతుగా మద్దతు ఇస్తేనే ఎన్‌డిఎ ప్రభుత్వం ఏర్పడనుంది. మరోవైపు కాంగ్రెస్ కూడా ఎన్‌డిఎలోని పార్టీలను దువ్వే ప్రయత్నాలు చేస్తోంది. అదే జరిగితే కాంగ్రెస్ కూడా ప్రభుత్వ ఏర్పాటులో ముందుండే ఛాన్స్ ఉంది. తాజా ఫలితాలను బట్టి ఎన్‌డి పక్షాలకు 296 సీట్లు వచ్చే అవకాశం కనిపిస్తోంది. ఇండియా కూటమికి 201 సీట్లు, ఇతరులకు 56కు పైగా సీట్లు వచ్చే ఛాన్స్ ఉంది. ఒక్క సీటు గెలిచిన ఎంఐఎం లాంటి వారు కూడా ఇప్పుడు ప్రభుత్వం ఏర్పాటులో కీలకం కాబోతున్నారు. ఈ క్రమంలో మోడీ నాయకత్వంపై అప్పుడే అనుమానాలు మొదలయ్యాయి. బిజెపితో పాటు, ఎన్‌డిఎ పక్షాల్లోనూ మోడీ పట్ల అంత సానుకూలత కనిపించడం లేదు. బిజెపి తమ ప్రధాని అభ్యర్థిని మార్చుకుంటే తప్ప ఎన్‌డిఎ పక్షాలు మద్దతు తెలిపే అవకాశాలు కనిపించడం లేదు. దేశ భవిష్యత్‌ను నిర్దేశిరచే ఎన్నికల పక్రియ ముగిసింది. ఫలితాలూ వచ్చేశాయి.. కానీ, ఇక్కడే పెద్ద ట్విస్ట్ ఇచ్చారు ఓటర్లు. ఎవరికీ పూర్తిస్థాయి మెజార్టీ ఇవ్వకపోవడంతో.. మళ్లీ సంకీర్ణ సర్కార్ అనివార్యమైంది. దీంతో అసలు చర్చ ఇప్పుడే ప్రారంభమైంది. ఇంతకాలం మోదీ 3.0 సర్కార్ వస్తుందని అంతా అనుకున్నా.. సీన్ రివర్స్ అయ్యింది. ఎగ్జిట్ పోల్స్ మోదీ నామం జపించినా.. అవన్నీ ఉత్తిదే అని తేలింది. 340, 350, 370, 400 ఇలా ఒక్కో ఎగ్జిట్ పోల్ ఒక్కో నెంబర్ ప్రకటించాయి. కానీ.. ఎగ్జాక్ట్ పోల్స్ వచ్చాక గానీ.. అసలు విషయం బయటపడింది. ఎన్నికల ఫలితాల్లో బీజేపీ సంగతి అటుంచితే.. ఎన్డీయే కూటమి మొత్తానికి కలిపి 295 సీట్లు దాటే పరిస్థితి కనిపిస్తలేదు. అదే సమయంలో ఇండియా కూటమి 230 సీట్ల వరకు గెలుచుకునే అవకాశం కనిపిస్తోంది. ఈ సంగతి ఇలా ఉంచితే.. దేశానికి తదుపరి ప్రధాని ఎవరనేది ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. పదేళ్లు అప్రతీహతంగా దేశాన్ని ఏలిన నరేంద్ర మోదీ.. ఇప్పుడు మరోసారి ఆ పదవిని అధిరోహిస్తారా? లేదా? అనేది సందేహాత్మకంగా మారింది. బీజేపీకి మేజిక్ ఫిగర్ సీట్లు రాకపోవడం, ఎన్డీయే కూటమిలో రెండు, మూడు పార్టీల భాగస్వామ్యం కీలకంగా మారింది. వారు మోదీ ప్రధాని అభ్యర్థిత్వాన్ని ఆమోదిస్తారా? అనే సందేహాలు వ్యక్తమవతుండటంతో.. ఈ ప్రశ్న ఉత్పన్నం అవుతోంది. ఎన్డీయే కూటమి 292 స్థానాల్లో మెజార్టీలో కొనసాగుతోంది. దాదాపు ఇవే స్థానాల్లో గెలుపొందే అవకాశం ఉంది. వీలేతై తగ్గే ఛాన్స్ కూడా ఉంది కానీ.. పెరిగే ఛాన్స్ అయితే లేదు. ఈ కూటమిలో ఇప్పుడు నితీష్ కుమార్ నేతృత్వంలోని జేడీయూ.. చంద్రబాబు నేతృత్వంలోని టీడీపీ కీలక పాత్ర పోషించనున్నాయి. ఎందుకంటే.. బీజేపీ సింగిల్‌గా 242 సీట్లలో మాత్రమే మెజార్టీ సాధించింది. అంటే ఈ పార్టీ నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పడాలంటే ఇంకా 30 సీట్లు కావాల్సి ఉంటుంది. ఇందులో టీడీపీకి 16 సీట్లు, జేడీయూ 12 సీట్లలో గెలుపొందాయి. ఈ రెండూ పార్టీలకు కలిపి 28 సీట్లు ఉన్నాయి. 292లో ఈ రెండు పార్టీలవే 28 స్థానాలు పోతే.. మిగిలిన 264 సీట్లు ఎన్డీయేకి ఉంటాయి. అంటే మేజిక్ ఫిగర్‌కు 8 సీట్లు తక్కువ అనమాట. అందుకే ఈ రెండు పార్టీలు ఇప్పుడు ఎన్డీయే కూటమిలో కీరోల్ పోషించనున్నాయి. వీరికి జనసేన కూడా తోడు కానుంది. అంతేకాకుండా.. ఎన్డీయేలోని మరికొన్ని చిన్నా చితకా పార్టీలు కూడా మోదీ ప్రధాని అభ్యర్థిత్వంపై అభ్యంతరం తెలిపే అవకాశం ఉంది. ఇంతకాలం ఎన్‌డిఎ పక్షాలకు పెద్దగా విలువ ఇవ్వని మోడీ నాయకత్వాన్ని వీరు అంత సులువుగా అంగీకరిస్తారా అన్నదే ప్రశ్న. వాస్తవానికి ఎన్డీయే కూటమిలోని చాలా పార్టీలు మోదీ ప్రధాని అభ్యర్థిత్వంపై అంతర్గతంగా తీవ్ర అసంతృప్తితో ఉంటూ వస్తున్నాయి. కానీ, ప్రజల్లో ఉన్న పాపులారిటీ కారణంగా.. ఆ అసంతృప్తిని బయటకు చెప్పలేకపోవడం, అధికారాన్ని వదులుకోవడం ఇష్టం లేని కారణంగానూ వెల్లడించలేదు. కానీ, ఇప్పుడు పరిస్థితి అలా లేదు. బీజేపీ నేతృత్వంలో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పాడాలంటే కూటమిలో ప్రతి పార్టీ కీలకం కానుంది. అందుకే.. వారు చెప్పినట్లు బీజేపీ వినాల్సిన పరిస్థితి ఏర్పడింది. పరిస్థితులను చూస్తుంటే మాత్రం ఈసారి మోదీ నాయకత్వాన్ని తీవ్ర వ్యతిరేకత ఎదురయ్యే అవకాశం కనిపిస్తోంది. కూటమిలోని ఆయా పార్టీలు మోదీ ప్రధాని అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకించే ఛాన్స్ ఉంది. ముఖ్యంగా ప్రధాని పదవిపై ఎప్పటి నుంచో కన్నేసిన.. జేడీయూ నేత నితీష్ కుమార్ ఈ విషయంలో ముందుంటారనే చర్చ నడుస్తోంది. అయనే కాదు.. మిగతా పార్టీలు కూడా మోదీకి బదులుగా మరొకరి పేరును ప్రతిపాదించాలని కోరే ఛాన్స్ ఉంది. ఈ కారణంగానే.. ఇప్పుడు దేశ తదుపరి ప్రధాని ఎవరు అనే సందేహం బలంగా వినిపిస్తోంది. ఈ అవకాశాన్ని వినియోగించు కుని.. ఎన్డీయే కూటమిలోని మోదీ వ్యతిరేకులంతా ఏకమవుతారా? లేక ఎలాగైతేనేం తమ ప్రభుత్వం ఏర్పడితే చాలు అని మోదీకే జై కొడతారా? అనేది ఆసక్తిగా మారింది. ఈ వ్యవహారం తేలాలంటే ఒకటి రెండ్రోజులు ఎదురు చూడాల్సిందే. మరోవైపు కాంగ్రెస్ కూడా ఎన్‌డిఎ పక్షాలకు గాలం వేసే అవకాశం లేకపోలేదు. పూర్తిస్థాయి ఫలితాలు వచ్చిన తరవాతనే అసలు రాజకీయం మొదలు కానుంది.







# శ్రీ గణేష్ విజయం కంటోన్మెంట్ ప్రజలకు అంకితం

- ఉప ఎన్నికల్లో శ్రీ గణేష్ ఘనవిజయం
- నియోజకవర్గ సమస్యలపై గళం ఎత్తుత: శ్రీ గణేష్
- కంటోన్మెంట్ విలీనం కొరకు ఢిల్లీలో ఆమరణ నిరాహార దీక్ష చేస్తా
- శ్రీ గణేష్ గెలుపు పట్ల పార్టీ నాయకులు సంబరాలు
- నా గెలుపుకు సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు
- కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్

**ఫోకస్ న్యూస్, సికింద్రాబాద్ కంటోన్మెంట్-జూన్ 04:**

కంటోన్మెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేగా శ్రీ గణేష్ విజయాన్ని సాధించారు. మంగళవారం నాడు సికింద్రాబాద్ లోని వెస్లీ కాలేజీలో జరిగిన ఉప ఎన్నికల కౌంటింగ్ లో శ్రీ గణేష్ సమీప ప్రత్యర్థి బీజేపీ అభ్యర్థి వంశీ తిలక్ పై 13,206 ఓట్లతో విజయం సాధించారు. మొదటినుంచి బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి నివేదిత ఏ రౌండ్ లోను పోటీ ఇవ్వలేకపోవటం విశేషం. కౌంటింగ్ లోను బిజెపి కాంగ్రెస్ మధ్య పోటీ కొనసాగుతూ వచ్చింది. చివరకు శ్రీ గణేష్ విజయం సాధించారు. శ్రీ గణేష్ మీడియాతో మాట్లాడుతూ.... కంటోన్మెంట్ ప్రజలకు తన విజయాన్ని అంకితం చేస్తున్నానని, ప్రజలకు అందుబాటులో ఉంటూ నియోజకవర్గ ప్రజల అవసరాలు తీరుస్తానని హామీ ఇచ్చారు. ముఖ్యంగా తన గెలుపు కోసం పనిచేసిన కార్యకర్తలకు, అధిష్టానం వర్గానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మైనంపల్లి హనుమంతరావు, కృష్ణారెడ్డికి, ప్రజలకు, ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. తదనంతరం కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీ గణేష్ గెలుపు సందర్భంగా సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు మహిళలు తదితరులు అధిక సంఖ్యలో విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్నారు.

# 5.51లక్షల ఓట్ల మెజారిటీతో రఘువీర్‌రెడ్డి ఘన విజయం



**మిర్యాలగూడ, (నేటి ఫోకస్ న్యూస్)-జూన్ 04:**

తెలంగాణలో హోరా హోరీ గా సాగిన పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు వెల్లడయ్యాయి. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ తన స్థానాలను పదిలం చేసుకుంది. ప్రధానంగా కాంగ్రెస్, బీ.జే.పీ పార్టీ ల మధ్య హోరా హోరి పోటీ సాగింది. కాంగ్రెస్ అభ్యర్థులు తమ ప్రభావం చూపించారు. గెలిచిన స్థానాల్లో నూ భారీ మెజార్టీ తో విజయం అందుకు న్నారు. నల్గొండ పార్లమెంట్ స్థానం నుంచి కాంగ్రెస్ ఎం.పీ అభ్యర్థిగా బరిలో దిగిన ఆ పార్టీ సీనియర్ నేత జానారెడ్డి పెద్ద కుమారుడు కుందూరు రఘువీర్ రెడ్డి అఖండ విజయయం సాధించారు. బీ.జే.పీ అభ్యర్థి సైదిరెడ్డి పై ఏకంగా 5.51 లక్షల భారీ మెజార్టీతో గెలుపొంది విజయ బావుటా ఎగరేశారు. మెజార్టీలో రికార్డు సృష్టించారు. తెలంగాణ పార్లమెంట్ ఎన్నికల చరిత్రలో ఇదే అత్యధిక మెజార్టీ కావటం విశేషం. దీంతో.. జనారెడ్డి రాజకీయ వారసత్వాన్ని కొనసాగించటమే కాకుండా.. రఘువీర్ రెడ్డి కొత్త రికార్డు క్రియేట్ చేశారు. గతంలో.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పీ.వీ నర్సింహారావు అత్యధిక మెజార్టీ సాధించిన ఎం.పీ గా రికార్డు సృష్టించారు. ఇప్పటి వరకు దేశంలో అత్యధిక మెజార్టీతో గెలుపొందిన ఎంపీల్లో నల్గొండ పార్లమెంట్ ఫలితాలు అన్ని రౌండ్స్ ముగిసే సరికి 5,59, 906 ఓట్ల భారీ మెజార్టీ తో కాంగ్రెస్ అభ్యర్థి కుందూరు రఘువీర్ రెడ్డి గెలుపు దేశంలోనే రెండో అతిపెద్ద మెజార్టీ తో రఘువీర్ రెడ్డి గెలుపు.

# ఉప్పరగూడెం కాంగ్రెస్ కార్యకర్తల సంబరాలు



**ఉప్పరగూడెం, (ఫోకస్ న్యూస్)-జూన్ 04:**

తెలంగాణలో హోరాహోరీగా సాగిన పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు వెల్లడయ్యాయి. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ తన స్థానాలను పదిలం చేసుకుంది ప్రధానంగా కాంగ్రెస్ బిజెపి బిఆర్ఎస్ తమ ప్రభావం చూపించారు గెలిచిన స్థానాలలో భారీగా మెజారిటీతో కాంగ్రెస్ పార్లమెంట్ ఎన్నికల్లో అఖండ మెజారిటీతో గెలుపొందిన కాంగ్రెస్ పార్టీ వరంగల్ ఎంపీ డాక్టర్ కడియ కావ్య గారు విజయం సాధించారు ఉప్పరగూడెం కాంగ్రెస్ కార్యకర్తలు నాయకులు సంబరాలు చేసుకున్నారు గ్రామ పార్టీ అధ్యక్షులు దుంపల ఉప్పలయ్య వేముల వెంకన్న దుంపల శ్యామ్ దుంపల రామాంజం దుంపల అశోక్ యూత్ అధ్యక్షులు ముసుకు శోభన్ ఉపాధ్యక్షులు నీలో విక్కి మహిళా అధ్యక్షురాలు కవిత మరియు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# కంటోన్మెంట్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ విజయం

- బీఆర్ఎస్ అభ్యర్థి నివేదితపై 9,725 ఓట్లతో శ్రీ గణెళిష్ గెలుపు

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-జూన్4:**

కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి శ్రీ గణెళిష్ విజయం సాధించారు. బీఆర్ఎస్ అభ్యర్థి నివేదితపై 9,725 ఓట్లతో శ్రీ గణెళిష్ ఘన విజయం సాధించారు. కాగా, కంటోన్మెంట్ ఎమ్మెల్యే సాయన్న మృతితో 2023లో జరిగిన ఎన్నికల్లో ఆయన పెద్ద కుమార్తె లాస్య నందిత బీఆర్ఎస్ తరఫున పోటీ చేసి గెలిచింది. కాగా, కొన్ని నెలలకే సంగారెడ్డి జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆమె మృతి చెందడంతో ఉప ఎన్నిక జరిగింది. దీంతో బిజెపి నుంచి పోటీ చేసిన శ్రీగణెళిశ్ తరవాత కాంగ్రెస్‌లో చేరి గెలిచారు.

# ఏపీ ప్రజల విస్పష్ట తీర్పు

- టిడిపి కూటమికి అధికారం కట్టబెట్టిన ప్రజలు
- వైకాపాకు ప్రతిపక్ష మోదా కూడా కట్టబెట్టని ఓటర్లు
- ఓటమి పాలయిన వైకాపా మంత్రులు
- రాయలసీమలోనూ సత్తా చాటిన టిడిపి
- 21 స్థానాల్లో పోటీ చేసి అన్నింటా గెలిచిన జనసేన
- పొత్తులతో లాభపడ్డ బిజెపి నేతలు
- 9న ప్రమాణానికి చంద్రబాబు ఏర్పాట్లు
- ప్రభుత్వం ఏర్పాటుపై పవన్ కళ్యాణ్‌తో చర్చలు

**నేటి ఫోకస్ న్యూస్, అమరావతి-జూన్4:**

ఆంధ్రప్రదేశ్‌లో ప్రజలు విస్పష్టమైన తీర్పును ప్రకటించారు. విపక్ష టిడిపికి సంపూర్ణ మెజార్టీ సాధించింది. దీంతో తదుపరి ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు టిడిపి రంగం సిద్దం చేసుకుంటోంది. ఇకపోతే అధికార వైకాపాను ప్రజలు ఈడ్చి అవతల పడేశారు. 175 అసెంబ్లీ సీట్లకు గాను తాజా సమాచారం మేరకు టిడిపి 136 సీట్లను గెల్చుకోబోతున్నది. ఇకపోతే పోటీచేసిన 21 స్థానాల్లో అఖండ విజయం సాధించి జనసేన చరిత్ర సృష్టించింది. బిజెపి 7 సీట్లను గెల్చుకుంది. దీంతో కూటమికి స్పష్టమైన ఆధిక్యం లభించగా వైకాపా పదిసీట్ల వద్దే ఆగిపోయింది. కుప్పంలో చంద్రబాబు, పులివెందులలో జగన్, పిఠాపురంలో పవన్‌కళ్యాణ్, తదితరులు విజయం సాధించారు.టిడిపి ప్రముఖులంతా విజయం సాధించారు. నేరుగా ప్రజలకు డబ్బుల పందేరం చేసి, విజయంపై ధీమాగా ఉన్న జగన్‌ను ప్రజలు ఓటుతో బుద్ది చెప్పారు. అభివృద్దిని విస్మరించి, అప్పులు చేసి పంచడమే అభివృద్ధి నినాదంగా వెళ్లిన వైకాపాకు గట్టి గుణపాఠం చెప్పారు. ఈ క్రమంలో సిఎం పదవికి జగన్ రాజీనామా చేయగా కొత్త సిఎంగా చంద్రబాబు 9న అమరావతిలోనే ప్రమాణం చేయబోతున్నారు. ప్రభుత్వం ఏర్పాటుపై జనసేనాని పవన్ కళ్యాణ్‌తో కలసి చర్చించనున్నారు. ఎపిలో అవినీతి, అక్రమాలతో పాటు, రాక్షసకాండ సాగించిన వైకాపాను గట్టిగా బుద్ది చెప్పారు. అధికారానికి పనికిరావని తీర్పు చెప్పారు. అలాగే పార్లమెంట్ ఎన్నికల్లో కూడా టిడిపి కూటమి 25కు 21 స్థానాల్లో విజయం సాధించే దిశగా ఉంది. వైకాపా కేవలం 4 సీట్లకే పరిమితం అయ్యింది. ఈ క్రమంలో గత ఐదేళ్లు సాగించిన అరాచక పాలనకు వైకాపా మూల్యం చెల్లించుకుంది. ఎన్నికల ఫలితాల్లో ఆ పార్టీ దారుణ ఓటమి మూటగట్టుకుంది. కౌంటింగ్ ప్రారంభం నుంచి ఏ దశలోనూ తెదేపా నేతృత్వంలోని కూటమికి కనీస స్థాయి పోటీ ఇవ్వలేకపోయింది. చివరకు ప్రతిపక్ష హోదా కూడా కోల్పోవడం గమనార్హం. ఆ హోదా రావాలంటే 18 మంది ఎమ్మెల్యేలు గెలుపొందాలి. కానీ వైకాపా మాత్రం.. 8-10 సీట్లకే పరిమితమైంది. వార్ వన్ సైడ్' అన్నట్లుగా కూటమి దుమ్ములేపింది. జగన్ నియంతృత్వ పాలనకు రాష్ట్ర ప్రజలు చరమగీతం పాడుతూ.. కూటమికి ఘన విజయం కట్టబెట్టారు. ఇప్పటికే 117 స్థానాల్లో విజయం సాధించిన కూటమి అభ్యర్థులు.. మరో 17 చోట్ల ఆధిక్యంలో ఉన్నారు. వైకాపా కంటే మెరుగ్గా జనసేన సొంతంగానే 21 స్థానాల్లో గెలుపొందింది. మొదటినుంచి ఫలితాల సరళి చూసి వైకాపాకు ప్రతిపక్ష హోదా అయినా దక్కుతుందా? అని రాజకీయ వర్గాల్లో అనుమానాలు వ్యక్తం కాగా.. చివరకు అదే నిజమైంది. ఇకపోతే ఎన్నికల ఫలితాల్లో టీడీపీ కూటమి అదరగొట్టింది. మొత్తం 13 ఉమ్మడి జిల్లాలకుగానూ 8 జిల్లాల్లో క్లీన్‌స్వీప్ చేసింది. ఈ ఎనిమిది జిల్లాల్లో 110 సీట్లు ఉండగా.. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి 110 సీట్లలో విజయం సాధించింది. ఉమ్మడి విశాఖ, ప్రకాశం, కడప, కర్నూలు, చిత్తూరు జిల్లాలోని మొత్తం 10 స్థానాల్లో మాత్రమే విజయం సాధించింది. ఉమ్మడి విశాఖలో 2, ఉమ్మడి ప్రకాశంలో ఒకటి, ఉమ్మడి కడప జిల్లాలో మూడు, కర్నూలు జిల్లాలో 2, చిత్తూరు జిల్లాలో 2 నియోజకవర్గాల్లో మాత్రమే వైసీపీ విజయం సాధించింది.

ఐదు జిల్లాల పరిధిలోని 65 నియోజకవర్గాలకు కేవలం 10 చోట్ల మాత్రమే వైసీపీ విజయం సాధించింది. మిగతా 55 నియోజకవర్గాల్లో టీడీపీ కూటమి విజయం సాధించింది. శ్రీకాకుళం జిల్లాలో పది నియోజకవర్గాలకు 8 నియోజకవర్గాల్లో టీడీపీ పోటీచేయగా అన్ని స్థానాల్లో విజయం సాధించింది. బీజేపీ, జనసేన చెరో స్థానంలో పోటీచేయగా.. ఆ రెండు చోట్ల బీజేపీ, జనసేన అభ్యర్థులు విజయం సాధించారు. విజయనగరం జిల్లాలో 9 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా టీడీపీ 8 స్థానాల్లో జనసేన ఒక చోట విజయం సాధించాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 19 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా టీడీపీ 13, జనసేన ఐదు, బీజేపీ ఒక స్థానంలో విజయం సాధించాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 15 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా టీడీపీ 9, జనసేన 6 స్థానాల్లో పోటీచేయగా.. ఆ రెండు పార్టీలు పోటీచేసిన అన్ని స్థానాల్లో గెలుపొందారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో 16 నియోజకవర్గాలు ఉండగా.. టీడీపీ 13, బీజేపీ 2, జనసేన ఒక స్థానంలో పోటీచేయగా.. ఆ మూడు పార్టీలు అన్ని స్థానాల్లో విజయం సాధించాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో మొత్తం 17 నియోజకవర్గాలు ఉండగా టీడీపీ 16, జనసేన ఒక నియోజకవర్గంలో పోటీచేయగా.. అన్ని స్థానాల్లో గెలుపొందాయి. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 14 నియోజకవర్గాలు ఉండగా.. టీడీపీ 13, బీజేపీ ఒకచోట విజయం సాధించాయి. ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని 10 నియోజకవర్గాలు ఉండగా.. అన్ని చోట్ల టీడీపీ అభ్యర్థులు గెలుపొందారు. ఉమ్మడి విశాఖలోని అరకు, పాడేరులో వైసీపీ అభ్యర్థులు విజయం సాధించారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని యర్రగొండపాలెం, ఉమ్మడి కడప జిల్లాలో బద్వేలు, రాజంపేట, పులివెందులలో మాత్రమే వైసీపీ అభ్యర్థులు విజయం సాధించారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని మంత్రాలయం, ఆలూరులో వైసీపీ గెలుపొందింది. చిత్తూరు జిల్లాలోని తంబళ్లపల్లె, పుంగనూరులో మాత్రమే వైసీపీ అభ్యర్థులు విజయం సాధించారు. మంత్రులంతా ఓటమి చెందారు. జగన్ మాత్రమే పులివెందులలో విజయం సాధించారు.

# మంగళగిరిలో లోకేశ ఘనవిజయం

- ఓడిన చోటే నిలబడి గెలిచిన యువనేత

**నేటి ఫోకస్ న్యూస్, మంగళగిరి-జూన్4:**

టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఘన విజయం సాధించారు. గత ఎన్నికల్లో మంగళగిరి నుంచి పోటీ చేసిన నారా లోకేష్ ఓటమి పాలయ్యారు. ఎక్కడ పోగొట్టుకున్నారో అక్కడే వెదుక్కోవాలన్నట్టుగా ఈసారి మంగళగిరి నుంచి పోటీ చేసి విజయం సాధించారు. గత ఐదేళ్లుగా నారా లోకేష్ ఎన్నో రకాల విమర్శలను ఎదుర్కొంటూ వస్తున్నారు. మంగళగిరిలో ఓటమి పాలయ్యారంటూ వైసీపీ నేతలు ఆయనను ఎన్నో విధాలుగా అవమానించారు. వాటన్నింటికీ నారా లోకేష్ తన విజయంతో సమాధానం చెప్పారు. తానేమీ తన కంచుకోట నుంచి పోటీ చేయడం లేదని.. టీడీపీ వీక్‌గా ఉన్న స్థానం నుంచి పోటీ చేశానని.. తిరిగి అదే స్థానం నుంచి పోటీ చేసి విజయం సాధిస్తానని లోకేష్ పలుమార్లు చెప్పారు. ఇప్పుడు ఆయన విజయం వైసీపీకి చెంపపెట్టు అని చెప్పాలి. ఇక రాష్ట్ర వ్యాప్తంగా ఎన్డీఏ కూటమి అద్భుతమైన విజయాన్ని సొంతం చేసుకుని చరిత్ర సృష్టించే దిశగా పరుగులు తీస్తోంది. ఇప్పటి వరకూ విజయం సాధించిన టీడీపీ అభ్యర్థులు ఎవరెవరంటే.. రాజమండ్రి గ్రామీణం లో గోరంట్ల బుచ్చయ్యచౌదరి... రాజమహేంద్రవరంలో ఆదిరెడ్డి వాసు... కొవ్వూరులో టీడీపీ అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు.. గాజువాకలో పల్లా శ్రీనివాసరావు.. పాలకొల్లులో నిమ్మల రామానాయుడు.. ఉరవకొండలో పయ్యావుల కేశవ్.. ప్రొద్దుటూరులో వరదరాజుల రెడ్డి విజయం సాధించారు. ఇక అనపర్తి నుంచి బీజేపీ అభ్యర్థి నల్లమిల్లి విజయం సాధించారు. నిమ్మల రామానాయుడు 69 వేల మెజార్టీతో విజయం సాధించడం విశేషం. అనపర్తిలో బీజేపీ అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి విజయం సాధించారు.

## 9న సిఎంగా చంద్రబాబు ప్రమాణం

- సంపూర్ణ మెజార్టీతో టిడిపి శ్రేణుల సంబరాలు

**నేటి ఫోకస్ న్యూస్, అమరావతి-జూన్4:**

ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో కనీ వినీ ఎరుగని విజయం సాధించడంతో చంద్రబాబు ప్రమాణస్వీకారం అంశంపై చర్చలు మొదలయ్యాయి. ఈ నెల తొమ్మిదో తేదీన అమరావతిలో ప్రమాణ స్వీకారం చేసే అవకాశం ఉంది. వైసీపీ గెలుస్తుందని తొమ్మిదో తేదిన విశాఖలో జగన్ ప్రమణస్వీకారం చేస్తారని ఆ పార్టీ నేతలు చెబుతూ వచ్చారు. అయితే టీడీపీ గెలుస్తుందని.. చంద్రబాబు అమరావతిలోనే ప్రమాణం చేస్తారని ఆ పార్టీ నేతలు చెబుతూ వచ్చారు. ఇప్పుడు అనూహ్యమైన విజయం సాధించడంతో అమరావతిలో ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లు చేయనున్నారు. 9న ఆయన సిఎంగా ప్రమాణం చేయను న్నారు. ఈ క్రమంలో రాత్రికి పవన్ కళ్యాణ్‌తో చంద్రబాబు చర్చలు జరుపనున్నారు. ఇదిలావుంటే ఏపీలో సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు కొనసాగుతోంది. విజయం దిశగా కూటమి అభ్యర్థులు దూసుకెళ్తు న్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ తెదేపా కార్యాలయానికి కార్యకర్తలు భారీగా చేరుకోవడంతో సందడి నెలకొంది. అదేవిధంగా విశాఖ, మంగళగిరిలోని తెదేపా కార్యాలయాల వద్ద పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకుంటున్నారు.

# యూత్‌కు క్రికెట్ కిట్ బహుకరణ

**కుక్కడం, (నేటి ఫోకస్ న్యూస్)-జూన్ 04:**

మాడుగులపల్లి మండలం కుక్కడం గ్రామంలోని యూత్ యువకులకు క్రికెట్ కిట్టు అందించిన బొంగరాల మహేష్, క్రికెట్ టోర్నమెంట్ లో పాల్గొని క్రికెట్ ఆడటానికి సరి అయిన ఆట సామాగ్రి లేక ఇబ్బంది పడుతున్న యూత్ కి వారి యొక్క ఆట నైపుణ్యం చూసి క్రికెట్ కిట్టు అందించడం జరిగింది. క్రికెట్ టోర్నమెంట్ లో వ్యక్తిగత గొడవలు చేయకుండా స్నేహభావాన్ని పెంపొందించుకోవాలని అదేవిధంగా క్రీడారంగంలో యూత్ రానించాలని వారికి క్రికెట్ కిట్లు బహుకరించడం జరిగింది.



# ప్రజాసేవకుడి కల నెరవేరింది..

- శ్రీ గణేష్‌కు శుభాకాంక్షలు తెలిపిన ముప్పిడి గోపాల్
- విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్న కాంగ్రెస్ నేతలు

**ఫోకస్ న్యూస్, సికింద్రాబాద్ కంటోన్మెంట్-జూన్ 04:**

కంటోన్మెంట్ నియోజకవర్గ ప్రజా సేవకుడు, ఊప ఎన్నికలలో ఎమ్మెల్యేగా గెలుపొందిన శ్రీ గణేష్ కు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్పిడి గోపాల్ శుభాకాంక్షలు తెలిపారు. కంటోన్మెంట్లో దివ్యకాలిక సమస్యలన్నీ పరిష్కారం అవుతాయని ముప్పిడి గోపాల్ వ్యక్తం చేశారు. నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేగా గెలిచిన శ్రీ గణేష్ కు విజయోత్సవ ర్యాలీలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. విజయోత్సవ ర్యాలీలో ముప్పిడి గోపాల్, వికాస్ మంచు ప్రధాన కార్యదర్శి సంకి రవీందర్, నంది కంటి రవి, జాజుల క్రాంతి, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఖమ్మం అభ్యర్థి రామసహాయం ఘన విజయం

- నామా నాగేశ్వర్ రావుపై 3,70,921 ఓట్ల మెజారిటీతో గెలుపు

**నేటి ఫోకస్ న్యూస్, ఖమ్మం-జూన్4:**

ఖమ్మం లోక్‌సభ స్థానాన్ని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది. కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురామ్ రెడ్డి అక్కడి నుంచి ఘన విజయం సాధించారు. ఆయన తన సమీప ప్రత్యర్థి, బీజేపీ అభ్యర్థి నామా నాగేశ్వర్ రావుపై 3,70,921 ఓట్ల మెజారిటీతో గెలిచారు. రామసహాయం రఘురామ్ రెడ్డి కౌంటింగ్ ప్రారంభమైన తర్వాత తొలి రౌండ్ నుంచి ఆధిక్యంలో కొనసాగుతూ వచ్చారు. చివరికి భారీ మెజారిటీతో విజయం దక్కించుకున్నారు. ఇక్కడ బీజేపీ అభ్యర్థిగా బరిలో దిగిన తాండ్ర వినోద్ రావు మూడో స్థానానికి పరిమితమయ్యారు. కాగా రామసహాయం రఘురామ్‌రెడ్డి తెలుగు నటుడు వెంకటేశ్‌కు, కాంగ్రెస్ నేత, పారిశ్రామికవేత్త పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వియ్యంకుడు. రఘురామ్ రెడ్డి ఇద్దరు కొడుకుల్లో ఒకరికి వెంకటేశ్, మరొకరికి పొంగలేటి తమ బిడ్డలను ఇచ్చి వివాహం జరిపించారు. లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపులో తెలంగాణలో తొలి విజయం నమోదైంది. ఖమ్మం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి 3.5 లక్షలకు పైగా ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. సమీప ప్రత్యర్థి, భారాస అభ్యర్థి నామా నాగేశ్వరరావుపై ఆయన విజయం సాధించారు. మరోవైపు కాంగ్రెస్‌కు చెందిన మల్లు రవి (నాగర్‌కర్నూల్), కడియం కావ్య (వరంగల్), గడ్డం వంశీకృష్ణ (పెద్దపల్లి), చామల కిరణ్ కుమార్ రెడ్డి (భువనగిరి), బలరాం నాయక్(మహబూబాబాద్), కుందురు రఘువీర్ రెడ్డి (నల్గొండ), సురేశ్ షెట్కార్(జహీరాబాద్) ఆధిక్యంలో కొనసాగుతున్నారు.

# లోక్‌సభలో బిఆర్‌ఎస్‌కు ఘోర పరాజయం

- ఒక్కచోట కూడా ముందంజలో లేని అభ్యర్థులు
- కౌంటింగ్ కేంద్రం వీడిన మల్కాజిగిరి అభ్యర్థి

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-జూన్4:**

లోక్‌సభ ఎన్నికల్లో బిఆర్ఎస్‌కు ఘోర పరాభవం తప్పేలా లేదు. ఒక్కటంటే ఒక్క సీటులో కూడా గెలిచే అవకాశం కనిపించడం లేదు. మెదక్‌లో సైతం బిఆర్ఎస్ వెనకబడి పోయింది. ఈ సీటుపై ఉన్న ఆశలు కూడా గల్లంతయ్యాయి. మొత్తంగా ఇప్పటివరకు బీఆర్ఎస్ పార్టీ బోణి కొట్టలేదనే చెప్పాలి. తాజా ఓట్ల లెక్కింపు ప్రకారం బిజెపి, కాంగ్రెస్ 8 స్థానాల చొప్పున గెలుపుదిశగా ఉన్నాయి. ఎంఐఎం తన హైదరాబాద్ సీటును నిలుపుకోనుంది. ఎగ్జిట్ పోల్ చెప్పినట్లే తెలంగాణ లోక్ సభ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ మధ్యనే ప్రధాన పోటి కొనసాగుతుంది. మల్కాజ్ గిరి పార్లమెంటు ఎన్నికల కౌంటింగ్ సెంటర్ నుంచి బిఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి వెళ్లిపోయారు. దాదాపు లక్ష ఓట్ల మెజార్టీతో బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ ముందున్నారు. దేశంలోనే అత్యధిక ఓటర్లు ఉన్న పార్లమెంట్ స్థానంగా మల్కాజ్ గిరి సీటుకు పేరుంది. ప్రజల తీర్పును స్వాగతిస్తున్నా అని లక్ష్మారెడ్డి మీడియాతో అన్నారు. ఇంకా ఎన్నికల కౌంటింగ్ పూర్తి కాలే కానీ, ఈటల విజయం దాదాపు ఖరారైనట్టే అని ఆ పార్టీ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. సొంత పార్టీ వారు ఏమైనా బిజెపి కి ఓటు వేశారా అని ఆయనను అడిగగా.. లేదు మా పార్టీ వారు మాకే ఓటు వేశారని సమాధానం ఇచ్చారు. పూర్తిగా ఇంకా ఎన్నికల కౌంటింగ్ కాలేదు కానీ బిజెపి ముందంజలో ఉంది అని అన్నారు. మా పార్టీ నాయకుడు సూచన మేరకు రాజకీయ భవిష్యత్తు ఉంటుంది అని అన్నారు. గతంలో ఈ సీటు నుంచి ప్రస్తు సిఎం రేవంత్ ప్రాతినిధ్యం వహించారు.

# బాలయ్య, చిరు కొత్త సినిమాలపై ఆసక్తి..



ఒకవైపు కొత్త సినిమాల విడుదలలు... మరోవైపు కొత్త కలయికల ప్రకటనలతోనూ చిత్రసీమ ఎప్పుడూ సందడిగా కనిపించేది. కానీ కొన్ని నెలలుగా స్తబ్దత నెలకొంది. ఎన్నికలు, ఐపీఎల్ కారణంగా విడుదలలు లేక వేసవి సీజన్ తుడిచి పెట్టుకుపోయింది. ఎన్నికల ఫలితాల తర్వాత మళ్లీ చిత్రసీమలో మునుపటి వాతావరణం నెలకొనే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పుడిప్పుడే కొత్త సినిమాల విడుదలలు ఊపందుకున్నాయి. వారం వారం మూడు సినిమాలొస్తున్నాయి. ఈ నెలలోనే 'కల్కి 2898 ఎ.డి' రాబోతోంది. కొత్త సినిమాల ప్రకటనలకీ రంగం సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది. ఇటీవలే 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' వేడుకలో పాల్గొన్న అగ్ర కథానాయకుడు బాలకృష్ణ 'మాది ఓ కాంబినేషన్ ఉంది, త్వరలోనే ప్రకటిస్తామ'ని చెప్పారు. 'విశ్వంభర' చిత్రీకరణతో బిజీగా గడుపుతున్న మరో అగ్ర నటుడు చిరంజీవి నుంచీ ఓ కొత్త ప్రకటన వెలువడే అవకాశాలున్నట్టు పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. మోహన్‌రాజా దర్శకత్వంలో, చిరంజీవి కథానాయకుడిగా ఓ చిత్రం రూపొందనున్నట్టు తెలుస్తోంది. ఈ చిత్రానికి సంబంధించిన కథా చర్చలు జరుగుతున్నాయి. బి.వి.ఎస్.రవి కథని సిద్ధం చేశారు. సాయిదుర్గా తేజ్ సహా యువ కథానాయకులు నటించే పలు చిత్రాలు అధికారిక ప్రకటన కోసం సిద్ధమవుతున్నాయి.



# ఇకపై మరింత కష్టపడతా..

నటిగా దక్షిణాదిలోని అగ్ర తారల్లో ఒకరిగా గుర్తింపు తెచ్చుకున్నారు సమంత. ఇటీవలే ఆమె మరో అరుదైన ఘనతను సొంతం చేసుకున్నారు. ఐఎండీబీ ఇటీవలే 'గత దశాబ్దంలో ఎక్కువ మంది చూసిన భారతీయ సెలబ్రిటీల జాబితా'పై సర్వే నిర్వహించింది. ఇందులో సమంతకు 13వ స్థానం లభించింది. ఈ విషయంపై ఆమె స్పందించారు. 'నటిగా ఇలాంటి గుర్తింపు తెచ్చుకున్నందుకు ఎంతో ఆనందంగా ఉంది. ఇది నా కృషికి, అదృష్టానికి తగిన ప్రతిఫలం. ఇండస్ట్రీలో ఇన్నేళ్లు ఎలా గడిచాయో తెలియట్లేదు. కెరీర్‌ను ఇప్పుడిప్పుడే మొదలుపెడుతున్నట్టు ఉంది. వరుస సినిమాల్లో నటించేందుకు అద్భుతమైన పాత్రలు వస్తున్నాయి. ఇకపై తాను నటించే ప్రతీ సినిమాలో అభిమానుల కోసం రెట్టింపు కష్టపడతా' అని చెప్పారు. కాగా, ఈ జాబితాలో బాలీవుడ్ బ్యూటీ దీపికా పదుకొణెలి అగ్రస్థానంలో నిలువగా.. షారుక్ ఖాన్, ఐశ్వర్య రాయ్ బచ్చన్, ఆలియా భట్ తర్వాతి స్థానాల్లో నిలిచారు. దక్షిణాది నుంచి తమన్నా, నయనతార 16, 18వ స్థానంలో నిలిచారు.






# కంగువా తర్వాత పూజాతో సూర్య మరో సినిమా

త్వరలో 'కంగువా'తో ప్రేక్షకులను పలకరించడానికి సిద్ధమవుతున్నారు తమిళ కథానాయకుడు సూర్య. ప్రస్తుతం వరుస సినిమాలతో తీరిక లేకుండా గడుపుతున్న ఆయన.. తన 44వ చిత్రం కోసం దర్శకుడు కార్తీక్ సుబ్బరాజుతో చేతులు కలిపిన సంగతి తెలిసిందే. పూజా హెగ్డే కథానాయిక. తాజాగా ఈ సినిమా చిత్రీకరణ మొదలైంది. ఈ విషయాన్ని తెలుపుతూ.. సామాజిక మాధ్యమాల వేదికగా ఓ వీడియోను పంచుకుంది చిత్రబృందం. 'లైట్స్, కెమెరా, యాక్షన్.. 'సూర్య 44' ప్రయాణం ప్రారంభమైంద'ని వ్యాఖ్యల్ని జోడించింది. ఇందులో సూర్య సరికొత్త లుక్‌లో కనిపిస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు. లవ్ అండ్ వార్ నేపథ్యంలో రూపొందుతున్న ఈ చిత్రాన్ని 2డీ ఎంటర్‌టైన్ మెంట్స్ నిర్మిస్తుంది. జోజు జార్జ్, జయరామ్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదల చేయనున్నట్లు తెలుస్తోంది.







# అవును రిలేషన్‌లో ఉన్నా: కృతిశెట్టి



తన తాజా సినిమా 'మనమే' ప్రమోషన్‌లో బిజీబిజీగా గడుపుతున్నది బెంగళూరు భామ కృతిశెట్టి. వరుసపెట్టి టీవీ ఛానళ్లకు ఇంటర్వ్యూలు ఇచ్చేస్తున్నది. ఈ క్రమంలో ఎదురవుతున్న చిలిపి ప్రశ్నలకు కూడా తెలివిగా సమాధానాలిచ్చేస్తున్నది ఈ అందాల బేబమ్మ. 'మీరు సింగిలా? రిలేషన్‌షిప్‌లో ఉన్నారా? అనే ప్రశ్నకు సమాధానమిస్తూ.. 'నేను సింగిల్ కాదు. రిలేషన్‌లోనే ఉన్నా' అని సూటిగా సమాధాన మిచ్చేసింది. 'ఎవరితో?' అనడిగితే.. 'నా పనితో.. నా పనితో రిలేషన్‌లో ఉన్నా' అంటూ నవ్వులు పూయించేసింది కృతిశెట్టి. కాబోయేవాడు ఎలావుండాలి? అనడిగితే.. 'మంచివాడై ఉండాలి. నిజాయితీపరుడై ఉండాలి. సాటివారిపై దయ కలిగినవాడై ఉండాలి' అంటూ అందంగా నవ్వేసింది. ఇంకా చెబుతూ 'నాకు డ్యాన్స్ చేయడం ఇష్టం. యాక్షన్ సినిమాలు ఇష్టం. హీరోల్లో రామ్‌చరణ్ అంటే అభిమానం. కలిసి నటించే అవకాశం వస్తే మిస్ చేసుకోను' అంటూ చెప్పుకొచ్చింది కృతిశెట్టి.

